సాక్షి
ఆదిలాబాద్
శుక్రవారం। 12। మే। 2023

ఐకేరెడ్డిని కలిసిన ఎమ్మెల్సీ విఠల్



ఉట్నూర్‌రూరల్: పదో తరగతి ఫలితాల్లో రాష్ట్రంలో నిర్మల్ జిల్లా ప్రథమ స్థానంలో నిలవడంతో సచివాలయంలో రాష్ట్ర మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డిని గురువారం ఎమ్మెల్సీ విఠల్ కలిశారు. పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.



నర్స్.. అమ్మ

10లో▸

ఆస్పత్రిలో అమ్మలాంటి ఆత్మీయ పలకరింపు.. ఎంత ఆపదలోనైనా ఏమీ కాదని ధైర్యం చెప్పే స్నేహితురాలు.. నేడు అంతర్జాతీయ నర్సుల దినోత్సవం సందర్భంగా ఉత్తమ సేవలందిస్తున్న నర్సులపై ప్రత్యేక కథనం.

గరిష్ఠం/కనిష్ఠం
43.0/27.0

వాతావరణం

ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతాయి. మధ్యాహ్నం ఎండతీవ్రత అధికం కానుంది. పలుచోట్ల పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది.

న్యూస్‌రీల్

హక్కులపై అవగాహన కలిగి ఉండాలి



పరికరాలు ఇస్తున్న జడ్జి జాబెజ్ శ్యాముల్

ఆదిలాబాద్‌టౌన్: వినియోగదారుల హక్కులు, చట్టాలపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని కన్జుమర్ కోర్టు జడ్జి జాబెజ్ శ్యాముల్ సూచించారు. గురువారం జిల్లా కేంద్రంలోని కన్జుమర్ కోర్టులో పౌర సరఫరాల శాఖ ద్వారా పంపిణీ చేసిన ఫుడ్ టెస్టింగ్ పరికరాలను కన్జుమర్ రైట్స్ ఆర్గనైజేషన్‌కు పంపిణీ చేశారు. అనంతరం జడ్జి మాట్లాడుతూ.. ప్రస్తుత కాలంలో ఆహార పదార్థాల్లో కల్తీ జరుగుతోందని, నివారించేందుకు కృషి చేయాలని సూచించారు. ఫుడ్ టెస్టింగ్ పరీక్షలను సంబంధిత శాఖల అధికారుల సమక్షంలో నిర్వహించాలని ఆదేశించారు. కార్యక్రమంలో కన్జుమర్ రైట్స్ ఆర్గనైజేషన్ అధ్యక్షుడు కిరణ్‌కుమార్, ఇర్ఫాన్, సురేందర్, శివన్న, సంతోష్, కృష్ణవేణి, రమ, వర్ష, చిట్టమ్మ పాల్గొన్నారు.

జిల్లావాసికి గణితంలో డాక్టరేట్



శ్రీనివాస్

తలమడుగు: మండలంలోని రుయ్యాడి గ్రామానికి చెందిన అరుగుల శ్రీనివాస్‌కు ఉస్మానియా యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసింది. అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ వీ కిరణ్ పర్యవేక్షణలో 'కామన్ ఫిక్స్‌డ్ పాయింట్ థిరమ్స్ ఫోర్ వీక్లీ కంపాటిబుల్ సెల్ఫ్‌మ్యాప్స్ ఆఫ్ ఏ ఎస్ మేట్రిక్ స్పేస్' అంశంపై శ్రీనివాస్ సమర్పించిన సిద్ధాంత వ్యాసానికి డాక్టరేట్ లభించింది. ఈ సందర్భంగా శ్రీనివాస్ కుటుంబ సభ్యులు, గ్రామస్తులు హర్షం వ్యక్తంజేశారు.

నూతన నియామకం

నార్నూర్: ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం (ఏఐబీఎస్ఎస్) జిల్లా అధ్యక్షుడిగా నార్నూర్ మండలం మహాగావ్ గ్రామానికి చెందిన జాదవ్ రెడ్డినాయక్, ప్రధాన కార్యదర్శిగా రూపావత్ అమర్‌సింగ్‌ను నియమిస్తున్నట్లు సంఘం జాతీయ అధ్యక్షుడు, మాజీ మంత్రి అమర్‌సింగ్ తిలావత్ తెలిపారు. గురువారం మండల కేంద్రంలోని దుర్గానగర్ కాలనీలో ఆయన విలేకరులతో మాట్లాడారు. లంబాడీలు ఇబ్బంది పడకుండా ఏఐబీఎస్ఎస్ కృషి చేస్తోందని చెప్పారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జాదవ్ శ్రీరాంనాయక్, లంబాడా జేఏసీ జిల్లా ఉపాధ్యక్షుడు అడే సురేశ్, నాయకులు చౌహాన్ బిక్కు, జాదవ్ బాలాజీ, బానోత్ విజయ్, రాథోడ్ దత్తరాం తదితరులున్నారు.


ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు



కౌంటర్ పనులు పరిశీలిస్తున్న డీఎం కల్పన

ఆదిలాబాద్: ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేలా అన్ని చర్యలు తీసుకుంటున్నామని ఆదిలాబాద్ ఆర్టీసీ డీఎం కల్పన పేర్కొన్నారు. స్థానిక బస్టాండ్‌లోని రిజర్వేషన్ కౌంటర్ నిర్మాణ పనులు తుది దశకు చేరుకోగా గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా నూతన ప్లాట్‌ఫాంలు ఏర్పాటు చేసి త్వరలో అందుబాటులోకి తీసుకురానున్నట్లు తెలిపారు. ప్రయాణికుల సౌకర్యార్థం ఇటీవలే కుర్చీలు, ఫ్యాన్లు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. మరో 15 రోజుల్లో రిజర్వేషన్ కౌంటర్‌ను అందుబాటులోకి తీసుకువస్తామని తెలిపారు. ఆమె వెంట ఆర్టీసీ ఉద్యోగులు, సిబ్బంది ఉన్నారు.

డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు



డాగ్‌స్క్వాడ్‌తో తనిఖీ చేస్తున్న ఎస్సై ముజాహిద్

బజార్‌హత్నూర్: మండలంలోని సొనాల, ఇచ్చోడ ఆర్‌అండ్‌బీ రోడ్డులో గురువారం ఎస్సై సయ్యద్ ముజాహిద్ ఆధ్వర్యంలో స్పెషల్ పార్టీ పోలీసులు తనిఖీలు నిర్వహించారు. బజార్‌హత్నూర్, బలన్‌పూర్ వంతెనల కింద, కల్వర్టుల వద్ద డాగ్ స్క్వాడ్, బాంబ్ డిస్పోసల్ స్క్వాడ్, బాంబ్ డిటెక్టర్లతో తనిఖీ చేశారు. రోడ్డుకు ఇరువైపులా పరిశీలించారు. ఈ రోడ్డు మహారాష్ట్రకు వెళ్లే అంతర్రాష్ట్ర రహదారి కావడం, వీఐపీలు రాకపోకలు కొనసాగించనుండడంతో మావోయిస్టుల ప్రభావం ఉండవచ్చనే అనుమానంతో తనిఖీలు నిర్వహించినట్లు ఎస్సై తెలిపారు.



వ్యవసాయ చేనులో ఏజీఎల్ బోర్‌వెల్

పైసలిచ్చినోళ్లకే పనులు..!

- విద్యుత్‌శాఖలో వసూళ్ల పర్వం
- ఏజీఎల్ బోర్‌వెల్ కనెక్షన్ నామినేషన్ పనుల కేటాయింపులో అక్రమాలు
- డబ్బులు తీసుకొని పనుల అప్పగింత
- ఓ అధికారిని నిలదీసిన కాంట్రాక్టర్లు

సాక్షి, ఆదిలాబాద్: ఇచ్చోడ సెక్షన్‌లోని తలమద్రిలో నాలుగు పనులకు సంబంధించి ఓ అధికారి నామినేషన్‌పై కాంట్రాక్టర్‌కు పనులు ఇచ్చేందుకు ఒప్పుకొన్నారు. ఇందుకు సంబంధించి అగ్రిమెంట్ చేసుకోవడమే తరువాయి. ఉన్నట్టుండి ఆ పనులను ఆ అధికారి మరో కాంట్రాక్టర్‌కు కొటేషన్ కూడా లేకుండా ఇచ్చినట్లు ఆరోపణలు వచ్చాయి. రాత్రికి రాత్రే డబ్బులు చేతులు మారడంతో ఈ పనులను సదరు ఆఫీసర్ తాను అనుకున్న వారికి ఇచ్చారనే ప్రచారం జరుగుతోంది. ఈ విషయంలో గురువారం ఆదిలాబాద్ డివిజన్ కార్యాలయంలో ఓ అధికారిని ఇద్దరు కాంట్రాక్టర్లు నిలదీయడంతో పనుల పంపకాల్లో జరుగుతున్న తంతు బయటకొచ్చింది.



పంట పొలాలకు వేసిన విద్యుత్ లైన్

థర్డ్ పార్టీతో పనుల పందేరం

నామినేషన్‌పై పనులు అప్పగించే వ్యవహారాన్ని డివిజనల్ స్థాయిలో డివిజన్ అధికారులు పర్యవేక్షించాలి. అయితే ఓ అధికారి థర్డ్ పార్టీ అంటే.. అక్రమ వ్యవహారాల్లో అందె వేసిన ఓ కాంట్రాక్టర్ ద్వారా పనుల పందేరం చేపట్టారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. వివిధ సెక్షన్లలో టెండర్ కాని పనులు తాము అనుకున్నవారికి, కొంతమంది కాంట్రాక్టర్లకే ఇచ్చారనే విమర్శలున్నాయి. అధికారి దగ్గరుండి నామినేషన్ పనులు కూడా కాంట్రాక్టర్లకు సమంగా పంచాల్సి ఉండగా, ఇందులో అవినీతికి తెరలేపి డబ్బులు ఇచ్చిన వారికే పనులు పంచారని ఆరోపిస్తున్నారు. రూ.70వేల పైనుంచి రూ.2లక్షల్లోపు పనులకు సంబంధించి పెద్ద ఎత్తున నామినేషన్‌పై అప్పగించారు. విద్యుత్ శాఖ ఆదిలాబాద్ సర్కిల్ పరిధిలోని డివిజనల్ స్థాయిలో ఇలాంటి వందలాది పనుల్లో నామినేషన్‌పై పలు పనులను కాంట్రాక్టర్లకు అప్పగించే విషయంలో పెద్ద ఎత్తున డబ్బులు చేతులు మారాయన్న ఆరోపణలు బాహాటంగానే వినిపిస్తున్నాయి.

ఏమిటీ పనులు..?

డీఆర్డీవో కింద సీఎం గిరివికాసం పథకంలో ఎస్టీ రైతుల భూముల్లో ఏజీఎల్ బోర్‌వెల్ కనెక్షన్లు ఇవ్వాలి. అలాగే ఆదిలాబాద్ ఎస్సీ కార్పొరేషన్ ద్వారా దళిత రైతులకు సంబంధించిన భూముల్లో ఏజీఎల్ బోర్‌వెల్ కనెక్షన్లు ఇవ్వాల్సి ఉంది. సీఎం గిరి వికాసం కింద 265, ఎస్సీ కార్పొరేషన్ ఎస్పీఏపీఈ కింద 208 కనెక్షన్లు ఇవ్వాలి. ఈ పనులను విద్యుత్ శాఖకు అప్పగించారు. ఆ పనులకు సంబంధించి గతనెల టెండర్ నోటిఫికేషన్ రావడం, అప్పట్లోనే దరఖాస్తుల స్వీకరణ, టెండర్ తెరవడం జరిగింది. ఆదిలాబాద్ విద్యుత్‌శాఖ సర్కిల్ పరిధిలో ఆదిలాబాద్, ఉట్నూర్ డివిజన్లు ఉండగా, వీటి కింద అనేక సెక్షన్లున్నాయి. ఈ సెక్షన్ల పరిధిలో వందలాది ఏజీఎల్ బోర్‌వెల్ కనెక్షన్ల పనులు చేపట్టాల్సి ఉంది. అయితే ఏ సెక్షన్‌లోనైతే టెండర్ దాఖలు కాలేదో అక్కడ ఆ పనులను నామినేషన్‌పై అప్పగించేందుకు అధికారులు నిర్ణయం తీసుకున్నారు. అలాగే రూ.2లక్షల అంచనా వ్యయం కంటే తక్కువగా ఉన్న పనులను కూడా నామినేషన్‌పై అప్పగించేందుకు చర్యలు చేపట్టారు. ఇక్కడే అవినీతికి తెరలేచింది. డివిజనల్ స్థాయిలో కొంతమంది అధికారులు తమకు అనుకూలమైన కాంట్రాక్టర్లతో కుమ్మక్కై డబ్బులు తీసుకొని పనులను ఇష్టారీతిన పంచారనే విమర్శలున్నాయి.

నా దృష్టికి రాలేదు



నామినేషన్‌పై పనులు నిబంధనల మేరకే అప్పగించడం జరిగింది. ఇదివరకు మూడుసార్లు టెండర్లు వాయిదా పడ్డాయి. ప్రధానంగా వానాకాలం కంటే ముందు పనులు చేపట్టాలని భావిస్తున్నాం. ఎవరైనా అధికారులు డబ్బులు తీసుకొని పనులు అప్పగించారనే ఆరోపణలుంటే నా దృష్టికి తీసుకురావాలి.
– సంపత్‌కుమార్, విద్యుత్‌శాఖ ఎస్ఈ, ఆదిలాబాద్

'విద్యార్థులు ఉన్నత స్థానాల్లో నిలవాలి'



విద్యార్థులతో కలెక్టర్ రాహుల్‌రాజ్, అడిషనల్ కలెక్టర్ రిజ్వాన్ భాషాషేక్ తదితరులు

ఆదిలాబాద్: విద్యార్థులు కష్టపడి చదివి జీవితంలో ఉన్నత స్థానాల్లో నిలవాలని కలెక్టర్ రాహుల్ రాజ్ పీఎస్ పేర్కొన్నారు. గురువారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో పదోతరగతి, ఇంటర్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తమ ఫలితాలు సాధించడం అభినందనీయమన్నారు. ర్యాంకులు, మార్కులు కొలమానం కాకుండా సబ్జెక్టుల వారీగా విషయ పరిజ్ఞానం పెంపొందించుకోవాలని సూచించారు. ఇదే స్ఫూర్తితో మరిన్ని ఉత్తమ ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు కృషి చేయాలని, ఇందుకు జిల్లా యంత్రాంగం పూర్తి సహాయ, సహకారాలు అందజేస్తుందని తెలిపారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రిజ్వాన్‌భాషాషేక్ మాట్లాడుతూ.. నవంబర్ నుంచే ప్రత్యేక తరగతులు, నెల వారీ పరీక్షలు నిర్వహించడం, సబ్జెక్టుల వారీగా విద్యార్థుల సందేహాలను నివృత్తి చేస్తే మంచి ఫలితాలు వచ్చినట్లు చెప్పారు. భవిష్యత్‌లో ఇదే స్ఫూర్తిని కొనసాగిస్తూ ఉన్నత స్థానాల్లో నిలవాలని ఆకాంక్షించారు. అనంతరం పదో తరగతిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన 44 మంది విద్యార్థులు, ఇంటర్‌లో 22మంది విద్యార్థులను శాలువాలు, జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలతో సత్కరించారు. కలెక్టర్, అదనపు కలెక్టర్ అభినందించారు. ఎన్ఐటీలో సీటు సాధించిన అభిషేక్‌రాజ్‌కు ల్యాప్‌టాప్ అందజేశారు. అనంతరం తెలంగాణ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలికి సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో శిక్షణ సహాయ కలెక్టర్ పీ శ్రీజ, జిల్లా విద్యాశాఖ అధికారి ప్రణీత, జిల్లా ఇంటర్మీడియెట్ విద్యాశాఖాధికారి రవీందర్, జిల్లా ఎస్సీ, మైనార్టీ సంక్షేమ శాఖల అధికారులు సునీతాకుమారి, కృష్ణవేణి ఇతర అధికారులు, ఉపాధ్యాయులున్నారు.

గైనిక్ నుంచి మరో విభాగానికి వైద్యుడి మార్పు

- విచారణ చేపట్టి చర్యలు తీసుకున్న రిమ్స్ డైరెక్టర్

సాక్షి ఎఫెక్ట్..

ఆదిలాబాద్‌టౌన్: ఇటీవల 'సాక్షి' దినపత్రికలో 'రిమ్స్ నుంచి వెళ్లగొడితే ప్రైవేట్‌లో ప్రసవం' శీర్షికన ప్రచురితమైన కథనానికి రిమ్స్ డైరెక్టర్ స్పందించారు. ఘటన జరిగిన తర్వాత ముగ్గురు సభ్యులతో కూడిన విచారణ కమిటీని ఏర్పాటు చేశారు. ఆ కమిటీ నివేదిక ఆధారంగా గైనిక్ వార్డులోని ఓ వైద్యుడిపై చర్యలు చేపట్టారు. గైనిక్ విభాగంలో పనిచేస్తున్న మేల్ వైద్యుడిని సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలోని ఓ విభాగానికి మార్పు చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతమైతే చర్యలు చేపడతామని హెచ్చరించారు. రోగులపై వైద్యులు మర్యాదపూర్వకంగా మెలగాలని తెలిపారు. రిమ్స్ ఆస్పత్రికి వచ్చే రోగులకు నాణ్యమైన వైద్యసేవలు అందించాలని ఆదేశించారు. రోగులకు ఏవైన ఇబ్బందులుంటే తన దృష్టికి తీసుకురావాలని పేర్కొన్నారు.



రిమ్స్ నుంచి వెళ్లగొడితే
ప్రైవేట్‌లో ప్రసవం

సాక్షిలో ఇటీవల ప్రచురితమైన కథనం

రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన కలిగి ఉండాలి

ఆదిలాబాద్‌టౌన్: రొమ్ము క్యాన్సర్‌పై మహిళలు అవగాహన కలిగి ఉండాలని రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ సూచించారు. గురువారం రిమ్స్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రొమ్ము క్యాన్సర్‌తో బాధపడుతున్న వారు సకాలంలో వ్యాధిని గుర్తిస్తే చికిత్స ద్వారా నయం అవుతుందని తెలిపారు. 45 ఏళ్లు పైబడిన మహిళల కోసం మూడురోజుల పాటు మమ్మోగ్రఫీ క్యాంప్ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. క్యాంప్‌నకు వచ్చిన మహిళలకు వైద్యులు పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రిమ్స్ సూపరింటెండెంట్ అశోక్, చంపత్‌రావు తదితరులు పాల్గొన్నారు.



సేవలను పరిశీలిస్తున్న జైసింగ్ రాథోడ్

రేపు ఎకనామిక్స్ పరీక్ష

ఆదిలాబాద్‌టౌన్: ఇటీవల వాయిదా పడిన ఓపెన్ స్కూల్ ఇంటర్మీడియెట్ ఎకనామిక్స్ పరీక్ష శనివారం నిర్వహించనున్నట్లు ఓపెన్ స్కూల్ ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ అశోక్ ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు పరీక్ష ఉంటుందని పేర్కొన్నారు.

వ్యవసాయ రంగంలో అగ్రి ఉద్యోగుల పాత్ర కీలకం



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న అగ్రి ఉద్యోగులు

ఆదిలాబాద్‌టౌన్: వ్యవసాయ రంగంలో అగ్రి ఉద్యోగుల పాత్ర కీలకమని ఎమ్మెల్యే జోగు రామన్న పేర్కొన్నారు. గురువారం ఆదిలాబాద్ పట్టణంలో అగ్రి ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించగా ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. కరోనా సమయంలోనూ అగ్రి ఉద్యోగులు సేవలందించారని గుర్తు చేశారు. వ్యవసాయ రంగాన్ని కాపాడేందుకు కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. కాగా, సంఘ భవనం నిర్మించాలని ఉద్యోగులు కోరగా ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో శరత్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

'బీజేపీ పాలనపై అసంతృప్తి'

ఎదులాపురం: కేంద్రంలో బీజేపీ పాలన, విధానాలపై ప్రజల్లో అసంతృప్తి వ్యక్తమవుతోందని సీపీఐ జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. 'బీజేపీకో హటావో.. దేశ్ కో బచావో' నినాదంతో పార్టీ ఆధ్వర్యంలో గురువారం జిల్లా కేంద్రంలోని రైల్వేస్టేషన్‌లో ప్రయాణికులకు కేంద్ర ప్రభుత్వ విధానాలపై అవగాహన కల్పించారు. బీజేపీ ప్రభుత్వం ప్రభుత్వ రంగసంస్థలను నిర్వీర్యం చేస్తోందని, ప్రజల ఆస్తులను కార్పొరేట్లకు అప్పనంగా అప్పగిస్తోందని ఆరోపించారు. ఎన్నడూ లేని విధంగా దేశంలో నిత్యావసరాలు, ముడిచమురు ధరలను అమాంతం పెంచి నిరుపేదల నడ్డి విరుస్తోందని విమర్శించారు. ప్రజావ్యతిరేక ప్రభుత్వాన్ని గద్దెదించాలని పిలుపునిచ్చారు. జిల్లా కార్యవర్గ సభ్యులు కుంటాల రాములు, మేస్రం భాస్కర్, నాయకులు గేడం కేశవ్, గేడం రేఖ, పెందూర్ తుకారాం, శంకర్ తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రభాకర్‌రెడ్డి

పేదరిక నిర్మూలనకు నిరంతర కృషి



అభివాదం చేస్తున్న నాయకులు

ఉట్నూర్‌రూరల్: పేదరిక నిర్మూలనకు టీడీపీ నిరంతరం కృషి చేస్తోందని ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు వీరేశ్ చెప్పారు. రాష్ట్రంలో పార్టీని బలోపేతం చేసేందుకు 'గడపగడపకు తెలుగుదేశం' కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. ఎన్టీఆర్ శత జయంత్యుత్సవాల సందర్భంగా ఉట్నూర్‌లోని హెచ్‌కేజీఎన్ ఫంక్షన్ హాల్‌లో గురువారం టీడీపీ మినీ మహానాడు నిర్వహించారు. వీరేశ్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ.. తెలంగాణను సీఎం కేసీఆర్ కుటుంబం దోచుకుంటోందని ఆరోపించారు. కేంద్రం ఎన్టీఆర్‌కు భారతరత్న ఇవ్వాలని మినీమహానాడులో తీర్మానించినట్లు చెప్పారు. అంతకుముందు అంబేడ్కర్, ఎన్టీఆర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు జయరాం, చంద్రదాస్, ఆనంద్, రాజిరెడ్డి, భీంరెడ్డి, తాళ్లపెల్లి రాజేశ్వర్, పవార్ దేవిదాస్, సునీత, రాము తదితరులున్నారు.

బీసీల సంక్షేమానికి పెద్దపీట

ఆదిలాబాద్: రాష్ట్ర ప్రభుత్వం బీసీల సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. బీసీల గురించి మాట్లాడే నైతిక హక్కు బీజేపీ నేతలకు లేదని మండిపడ్డారు. బీసీల సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం రూ.రెండు వేల కోట్లు మాత్రమే కేటాయించి అవమానిస్తే రాష్ట్ర ప్రభుత్వం రూ.ఆరువేల కోట్లు కేటాయించిందన్నారు. అర్హులైన బీసీలకు డబుల్ బెడ్రూం ఇళ్లు కేటాయించినట్లు తెలిపారు. ఈ విషయంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాయల్ శంకర్ వ్యాఖ్యలు ఖండిస్తున్నామని చెప్పారు. రాష్ట్రంలో బీసీ సంఘ భవనాలు నిర్మిస్తూ రాష్ట్ర ప్రభుత్వం వారికి అన్ని విధాలుగా అండగా నిలబడుతోందని స్పష్టం చేశారు. అవగాహన లేకుండా బీజేపీ నేతలు విమర్శలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. ఆయన వెంట ఎంపీపీ గండ్రత్ రమేశ్, మాజీ ఎంపీపీ సేవా లక్ష్మీజగదీశ్, నాయకులు చంద్రయ్య, కుమ్ర రాజు, ఖయ్యూం, అశోక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీసీసీబీ చైర్మన్ భోజారెడ్డి

'బూర్నూర్' గ్రామ చరిత్రకు రాష్ట్రస్థాయి బహుమతి

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగు లెక్చరర్‌గా పనిచేస్తున్న ఆర్.సంతోష్‌కుమార్ ఆధ్వర్యంలో విద్యార్థులు రూపొందించిన బూర్నూర్ గ్రామ చరిత్ర ప్రాజెక్ట్‌కు రాష్ట్రస్థాయి బహుమతి లభించింది. ఈనెల 1న హైదరాబాద్‌లోని ప్రభుత్వ సిటీ కళాశాలలో జరిగిన రాష్ట్రస్థాయి జిజ్ఞాస పోటీల్లో రాష్ట్రస్థాయి ద్వితీయ బహుమతికి ఎంపికైంది. ఈనెల 16న పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో జరిగే కార్యక్రమంలో సంతోష్‌కుమార్ రూ.21వేల నగదు, ప్రశంసాపత్రాన్ని అందుకోనున్నారు. రాష్ట్రస్థాయి బహుమతి లభించడంపై కళాశాల ప్రిన్సిపాల్ జగ్‌రాం గురువారం లెక్చరర్ సంతోష్‌కుమార్, విద్యార్థులను అభినందించారు.



విద్యార్థులతో లెక్చరర్ సంతోష్‌కుమార్

సదాశివ మాస్టారుకు నివాళి

ఆదిలాబాద్‌రూరల్: కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత సామల సదాశివ మాస్టారు జయంతిని పద్మశాలీ సంఘం, పద్మశాలీ అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ ఆధ్వర్యంలో గురువారం ఆదిలాబాద్ పట్టణంలోని కొండా లక్ష్మణ్‌బాపూజీ చౌక్‌లో ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సాహితీ రంగానికి ఆదిలాబాద్ ముద్దుబిడ్డ సదాశివ చేసిన సేవలు కొనియాడారు. ఈ సందర్భంగా పద్మశాలీ సంఘం నేతలు మాట్లాడుతూ.. సదాశివ మాస్టారు సామాన్య కుటుంబంలో జన్మించి కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డుతో పాటు రాజీవ్ పురస్కార్ అవార్డులు పొందారని చెప్పారు. మాస్టారు ఆదిలాబాద్ జిల్లాకే వన్నె తెచ్చారని పాప సంఘం జిల్లా అధ్యక్షుడు బేత రమేశ్ పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమంలోనూ కలానికి పదును పెట్టి తనవంతు కీలక పాత్ర పోషించారని, సంగీత శిఖరాలు, మలయ మారుతాలు రచనలతో పాటు తెలంగాణ యాస, భాషతో తనకంటూ సదాశివ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారని పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలో సదాశివ పేరిట విగ్రహం నెలకొల్పాలన్నారు. పద్మశాలీ సంఘం జిల్లా అధ్యక్షురాలు మంచికట్ల ఆశమ్మ మాట్లాడుతూ.. సాహితీ రంగానికి పేరు తెచ్చిన సామల సదాశివకు ఆదిలాబాద్‌కు అనుబంధం ఉందని, గల్లీ నుంచి ఢిల్లీ స్థాయికి ఎదిగిన అతడిని ప్రభుత్వం గుర్తించకపోవడం శోచనీయమన్నారు. మాస్టారు విగ్రహం నెలకొల్పి ప్రభుత్వం గుర్తింపు ఇవ్వాలని కోరారు. లేనిపక్షంలో సంఘం తరఫున విరాళాలు సేకరించి విగ్రహం నెలకొల్పుతామన్నారు. సాహితీవేత్త, సదాశివ మాస్టారు కుమారుడు సామల రాజవర్ధన్, కోశాధికారి బాస దత్తు, జిల్లా ఉపాధ్యక్షుడు బూర్ల శంకరయ్య, పెంట వెంకన్న, కొక్కుల అడెల్లు, పోప గౌరవాధ్యక్షుడు, బాస లింగన్న, కార్యదర్శి మాచర్ల శివకుమార్, కోశాధికారి పెంట చంద్రమోహన్, తాలూకా గౌరవాధ్యక్షుడు జక్కుల సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు చిప్ప గంగన్న, ఆదిలాబాద్ మండలాధ్యక్షుడు ఊషన్న, శ్రీనివాస్, విఠల్, బీసీ సంక్షేమ సంఘం జిల్లా నాయకుడు కాసర్ల శ్రీనివాస్ ఉన్నారు.



మాస్టారుకు నివాళులర్పిస్తున్న పద్మశాలీలు

క్లుప్తంగా

జాతీయస్థాయి కథల పోటీలు

నిర్మల్‌చైన్‌గేట్: జాతీయ స్థాయి సాహితీ సంస్థ ×ఉస్మానియా కవుల వేదిక×, ×శ్రీ శ్రీ కళావేదిక–నిర్మల్ అంతర్జాతీయ సంస్థ× సంయుక్త ఆధ్వర్యంలో జాతీయ స్థాయి కథల పోటీలు నిర్వహించనున్నట్లు డాక్టర్ ఎల్మల రంజిత్ కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. విజేతలకు ప్రథమ బహుమతి రూ.501, ద్వితీయ బహుమతి రూ.201, తృతీయ బహుమతి రూ.101 అందించనున్నారు. 'కథ సరస్వతీ పుత్రులు' అనే పురస్కారం కూడా అంతర్జాలంలో అందిస్తారన్నారు. ఉత్తమ కథలను సమదర్శిని పత్రికలో ప్రచురించనున్నట్లు తెలిపారు. కథలు ఏ4 సైజులో 10 పుటలు మించరాదని, వస్తువు, పాత్రలు నిర్మల్ జిల్లాకు చెందినవి అయివుండాలన్నారు. కథలను జూన్ 30 లోగా 9849808757 నంబర్‌కు వాట్సాప్ చేయాలని సూచించారు.

ఫ్లెక్సీ షాపులో చోరీ



సీసీ ఫుటేజీలో దొంగలు

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలో రోజురోజుకూ చోరీలు పెరిగిపోతున్నాయి. ఇటీవల అత్యధికంగా ద్విచక్ర వాహనాలు, తాళం వేసి ఉన్న ఇళ్లకు కన్నం వేసిన విషయం విదితమే. తాజాగా గురువారం తెల్లవారు జామున జిల్లా కేంద్రంలోని బస్టాండ్ సమీపంలో గల ఐడియా ఫ్లెక్సీ షాపు వెనుక భాగంలో ఇద్దరు చోరీకి పాల్పడ్డారు. షాపులో ఉన్న కూలర్‌తో పాటు సింటెక్ వాటర్ ట్యాంక్‌ను ఎత్తుకెళ్లారు. ఈ దృశ్యాలు సమీపంలోని ఓ సీసీ కెమెరాలో రికార్డు అయ్యాయి. గతంలో కూడా బస్టాండ్ ప్రాంతంలో దొంగతనాలు జరిగాయి.

వైద్య సేవలు మెరుగుపర్చాలి



జిల్లా వైద్యులు, వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ సుబ్బరాయుడు


మంచిర్యాలటౌన్: ప్రజలకు అందిస్తున్న వైద్య సేవలు మరింత మెరుగు పర్చాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ సుబ్బరాయుడు అన్నారు. జిల్లా కేంద్రంలోని రాజీవ్‌నగర్ అర్బన్ హెల్త్ సెంటర్‌ను గురువారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బందితో మాట్లాడుతూ గర్భిణుల నమోదు చేయాలని, పరీక్షలు పెంచాలని, రక్తహీనత కేసుల వివరాలను ఎప్పటికప్పుడు రిపోర్టు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శ్వేత, అపర్ణ, స్టాఫ్‌నర్సులు వరలక్ష్మి, పుష్పలత, డెమో బుక్కా వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి

మంచిర్యాలటౌన్: అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో రోజువారీగా నిర్వహించే కార్యక్రమాలు ఆన్‌లైన్‌లో నమోదు చేసి, ఆఫ్‌లైన్‌లో సమీక్షించాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ సుబ్బరాయుడు అన్నారు. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయంలో గురువారం వైద్యులు, వైద్య సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. డీఎంహెచ్‌వో మాట్లాడుతూ ఓపీ విధుల కోసం సమయాన్ని కేటాయించడంతోపాటు ఆ రోజు జరిగిన అన్ని ఆరోగ్య కార్యక్రమాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని తెలిపారు. సాధారణ ప్రసవాలు పెంచేలా గర్భిణులను సంసిద్ధం చేయాలని అన్నారు. విజయపూర్ణిమ, నీరజ, అనిత పాల్గొన్నారు.

నర్స్.. అమ్మ

- నిస్వార్థ సేవకు వారు ప్రతిరూపం
- ఎన్ని కష్టాలు ఉన్నా.. మోములో చెరగని చిరునవ్వు
- సొంతవారిలా రోగులకు సపర్యలు
- రోగుల ఆలన..పాలన వారి బాధ్యతే
- నేడు అంతర్జాతీయ నర్సుల దినోత్సవం



రోగులకు సేవలు అందిస్తున్న స్టాఫ్ నర్సులు

ఆదిలాబాద్‌టౌన్/నిర్మల్‌చైన్‌గేట్: ఆస్పత్రికి వెళ్లగానే అమ్మలాంటి ఓ ఆత్మీయ పలకరింపు.. ఎంత ఆపదలో ఉన్నా ఏమీ కాదని ధైర్యం చెప్పే స్నేహితురాలు.. మంచంపై కదలలేని వారిని తన వారిగా భావించి సపర్యలు చేసే సేవకురాలు.. వ్యాధి నయమై డిశ్చార్జి అయ్యే వరకూ మానసిక ధైర్యం అందించే కౌన్సిలర్. డాక్టర్ వైద్యం చేసినా.. కుటుంబ సభ్యులుగా రోగులకు మనోధైర్యం అందించేది మాత్రం నర్సులే. నర్సుల సేవలు వెలకట్టలేనివి. వారి రుణం తీర్చుకోలేనిది. కులం, మతం, పేద, ధనిక అని తేడా లేకుండా నిస్వార్థంగా సేవ చేసే వారు. వైద్యుల సలహా మేరకు మందులు ఇస్తారు. అమ్మలా ఆత్మీయత పంచుతారు. ఓ అక్కలా సలహాలిస్తారు. స్నేహితురాలిలా అండగా ఉంటారు. రోగులకు సేవచేయడమే జీవిత పరమార్థంగా భావించి 'లేడీ ఆఫ్ ది ల్యాంప్'గా ఖ్యాతికెక్కిన సేవామూర్తి ఫ్లోరెన్స్ నైటింగేల్ పుట్టిన రోజు సందర్భంగా ఏటా మే 12న ప్రపంచ నర్సుల దినోత్సవం నిర్వహిస్తున్నారు. నేడు అంతర్జాతీయ నర్సుల దినోత్సవం సందర్భంగా ఉత్తమ సేవలు అందిస్తున్న ఉమ్మడి జిల్లా నర్సులపై ప్రత్యేక కథనం.

నర్సింగ్ ఆఫీసర్లుగా గుర్తింపు...

ప్రజలకు వైద్య సేవలందిస్తున్న నర్సులను కేంద్ర ప్రభుత్వం ఇటీవలే నర్సింగ్ ఆఫీసర్లుగా గుర్తించింది. నర్సింగ్ ఆఫీసర్లుగా పిలవాలని సూచించింది.

సేవ చేయాలనే లక్ష్యంతోనే..



భైంసాటౌన్: ఇరవై ఏళ్లుగా నర్సుగా విధులు నిర్వర్తిస్తున్నా. 2012, 2018, 2020లో మూడుసార్లు కలెక్టర్ చేతుల మీదుగా ఉత్తమ అవార్డు అందుకున్నా. 2012లో ఓ మహిళకు నార్మల్ డెలివరి చేసే క్రమంలో గర్భసంచి బయటకు వచ్చింది. వెంటనే డాక్టర్లను పిలువగా వారు తీవ్రంగా శ్రమించి ఆమె ప్రాణాలు కాపాడారు. నేను పేషంట్ వద్దే రోజంతా ఉండి సపర్యలు చేసిన ఘటన ఇప్పటికీ గుర్తుకు వస్తుంది.

– విజయశ్రీ, సీనియర్ నర్స్, భైంసా ఏరియా ఆస్పత్రి

అదృష్టంగా భావిస్తున్నా..



ఉట్నూర్‌రూరల్: ఏజెన్సీ ప్రాంతంలో గిరిజనులకు వైద్యసేవలు అందించడం అదృష్టంగా భావిస్తున్నా. 26 ఏళ్లుగా విధులు నిర్వహిస్తున్నా. జైనూర్ మండల కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న సమయంలో మారుమూల గ్రామాలకు రోడ్డు సౌకర్యం లేకపోవడంతో నడుచుకుంటూనే వాగులు దాటుకుంటూ గుట్టలు ఎక్కుతూ వెళ్లి వైద్య సేవలు అందించాం.

– గౌదాని, నర్సు, దంతన్‌పల్లి పీహెచ్‌సీ

సేవకు గుర్తింపుగా..



ఆదిలాబాద్‌టౌన్: 2011లో కాంట్రాక్ట్ స్టాఫ్ నర్సుగా విధుల్లో చేరా. రిమ్స్, భీంపూర్ పీహెచ్‌సీలో సేవలందించా. సేవకు గుర్తింపుగా మూడుసార్లు అప్పటి కలెక్టర్ల చేతుల మీదుగా అవార్డులు అందుకున్నా. నేను పనిచేసిన కాలంలో భీంపూర్ పీహెచ్‌సీకి కాయకల్ప, ఎన్క్యాస్ అవార్డులు వచ్చాయి. 2021లో రెగ్యులర్ స్టాఫ్ నర్సుగా రిమ్స్‌లో చేరా. నా సేవలకు ప్రతిఫలం దక్కడం సంతోషంగా ఉంది.

– పి.శ్యామల, స్టాఫ్ నర్సు

మానవ సేవే మాధవ సేవ..



ఆదిలాబాద్‌టౌన్: రోగులకు సేవ చేయడం దేవుని సేవగా భావిస్తా. కరోనా సమయంలో నూ విధులకు వెనుకాడలేదు. పాము కాటువేయడంతో ఏజెన్సీ ప్రాంతం నుంచి ఓ గిరిజన రిమ్స్‌కు వచ్చింది. ఆ తర్వాత కోమాలోకి వెళ్లిపోవడంతో వైద్యం అందించా. ఆమె కోలుకోవడంతో నేను పొందిన అనుభూతి చెప్పలేనిది. ఆమె కుటుంబసభ్యుల సంతోషం ఇప్పటికీ నా కళ్లెదుటే కనిపిస్తోంది.

– నాగమణి, స్టాఫ్ నర్సు

37 ఏళ్లుగా సేవలు అందిస్తున్నా



నిర్మల్‌చైన్‌గేట్: మా అమ్మగారికి ఒంట్లో బాగా లేనప్పుడు ఆస్పత్రికి వెళ్తే సేవ చేసిన నర్సును చూసి నేను కూడా ఈ వృత్తికి రావాలని అనుకున్నా. 1986లో ఉద్యోగంలో చేరా. రాష్ట్ర ప్రభుత్వం మరో మూడేళ్ల సర్వీస్ పెంచడంతో ఇంకొంతకాలం రోగులకు సేవ చేసుకునే భాగ్యం దక్కింది.

– టి.భారతి, నర్సింగ్ సూపరింటెండెంట్

మనోధైర్యం అందించాం...



నిర్మల్‌చైన్‌గేట్: కరోనా కాలంలో వృత్తి మీదున్న బాధ్యతతో, రోగుల మీద ఉన్న కరుణతో సపర్యలు చేస్తూ వారిలో మనోధైర్యం అందించాం. నిర్మల్ ప్రభుత్వ ఆస్పత్రికి రోజుకు వందల సంఖ్యలో పేషెంట్లు వస్తున్నా అంకిత భావంతో సేవలు అందిస్తున్నాం.

– షాయిదా బేగం, స్టాఫ్‌నర్స్ జిల్లా ఆస్పత్రి

భరోసా కల్పిస్తున్నాం



నిర్మల్‌చైన్‌గేట్: జిల్లా ఆస్పత్రికి వచ్చే రోగుల బాధను అర్థం చేసుకుని వారికి భరోసా కల్పించేలా మెరుగైన సేవలు అందిస్తున్నా. రోగితో పాటు బంధువులకు జిల్లా ఆస్పత్రి సేవలపై నమ్మకం కలిగేలా నడుచుకుంటున్నాం. ఆపదలో ఉన్నవారికి సేవ చేయడం అదృష్టంగా భావిస్తున్నాం.

– విజయశ్రీ, స్టాఫ్ నర్సు, జిల్లా ఆస్పత్రి

నైటింగేల్ స్ఫూర్తితో...



నిర్మల్‌చైన్‌గేట్: రోగులకు విశిష్ట సేవలందించి నర్సులందరికీ ఆదర్శవంతంగా నిలిచిన నైటింగేల్ స్ఫూర్తితో విధులు నిర్వర్తిస్తున్నా. నర్సుగా సేవలందించే సమయంలో రోగుల కళ్లలో ఆనందం, వారు పంచే అభిమానం మరచిపోలేం. రోగులను కుటుంబ సభ్యులుగా భావించి సేవలందిస్తు న్నా.

– గురిజాల వనిత, స్టాఫ్‌నర్సు, జిల్లా ఆస్పత్రి

కుటుంబ సభ్యులుగా భావిస్తాం..



నిర్మల్‌చైన్‌గేట్: ఆస్పత్రికి వచ్చే వారిని రోగులుగా కాకుండా కుటుంబ సభ్యులుగా భావించి సేవలు అందిస్తున్నాం. త్వరగా వ్యాధి నయమై సంతోషంగా ఇంటికి వెళ్లాలని కోరుకుంటాం.

– పి.సుజాత, ఖానాపూర్ సీహెచ్‌సీ

ఆప్యాయ పలకరింపు..



నిర్మల్‌చైన్‌గేట్: అన్ని ఉద్యోగాలకంటే ఉన్నతమైనది నర్సు వృత్తి. వ్యాధి నయమయ్యాక ఆ రోగి పిలిచే ఆప్యాయ పలకరింపు గొప్ప ఆనందాన్నిస్తుంది. ఆ ఆనందం ముందు ఏదైనా తక్కువే. రోగులందరినీ కుటుంబ సభ్యుల్లా భావిస్తా. అందుకే రోగం ఎంత భయాంతకమైనదైనా సేవచేయగలుగుతున్నా. సేవచేయాలన్న కోరిక ఉన్నా అది అందరికీ లభించదు.

– గంగామణి, లక్ష్మణచాంద పీహెచ్‌సీ

భావితర నర్సులను..



ఆదిలాబాద్‌టౌన్: నేను 15 ఏళ్లపాటు ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో స్టాఫ్ నర్సుగా పనిచేశా. ఎంతో మంది రోగులు వచ్చేవారు. ఏనాడు నిరుత్సాహానికి లోనుకాలేదు. ప్రస్తుతం రిమ్స్‌లోని నర్సింగ్ కళాశాలలో లెక్చరర్‌గా పనిచేస్తున్నా.

– శ్రీదేవి, నర్సింగ్ కళాశాల లెక్చరర్

అమ్మ వేదనను చూసి..



ఆదిలాబాద్‌టౌన్: మాఅమ్మ డయాబెటిస్‌తో బాధపడుతుండడంతో తరచూ ఆస్పత్రికి వెళ్లేవాళ్లం. అమ్మ బాధను చూసి నేను అనారోగ్యంతో బాధపడే వారికి సేవ చేయాలనే ఉద్దేశంతో ఈ వృత్తిని ఎంచుకున్నా. నేను 2011 నుంచి స్టాఫ్ నర్సుగా సేవలు అందిస్తున్నా. రోగుల్లో మా అమ్మను చూసుకుంటూ సేవలు చేస్తున్నా.

– జ్యోతిప్రసన్న, స్టాఫ్ నర్సు

ఆ సంతోషమే వేరు



ఆదిలాబాద్‌టౌన్: రిమ్స్‌లోని గైనిక్ వార్డులో ఎన్‌పీఎం స్టాఫ్ నర్సుగా సేవలు అందిస్తున్నా. పురిటి నొప్పులతో వచ్చే గర్భిణికి సుఖవంతమైన ప్రసవం జరిగి తల్లీబిడ్డ క్షేమంగా ఇంటికి వెళ్లినప్పుడు ఆ సంతోషమే వేరు. సేవ మార్గంతోనే ఈ వృత్తిని ఎంచుకున్నా.

– సరిత, ఎన్‌పీఎం స్టాఫ్ నర్సు

బాధ్యత పెంచింది



నిర్మల్‌చైన్‌గేట్: గతేడాది అంతర్జాతీయ నర్సుల దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు చేతుల మీదుగా ఉత్తమ నర్సుగా అవార్డు అందుకోవడం సంతోశంగా ఉంది. నాకు దక్కిన గుర్తింపుతో ఉత్సాహంగా పనిచేస్తున్నా. పేదలకు సేవ చేయడంలో కలిగే సంతృప్తి వెలకట్టలేనిది.

– అపర్ణ, నర్సాపూర్ పీహెచ్‌సీ

ఇష్టంతో..



నిర్మల్‌చైన్‌గేట్: నర్సుగా విధుల్లో చేరినప్పటి నుంచి ఇష్టంగా రోగులకు వైద్యసేవలు అందిస్తున్నా. ఆపదలో ఉన్న వారికి సేవలు అందించే అవకాశం లభించడం పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నా. నర్సులందరికీ నైటింగేల్ స్ఫూర్తి కావాలి. ప్రజలు కూడా పూర్తిస్థాయిలో సహకరించాలి.

– అర్చన, స్టాఫ్‌నర్సు, భైంసా ఏరియా ఆస్పత్రి

నాటుసారా విక్రయిస్తే చర్యలు



నాటుసారా ధ్వంసం చేస్తున్న అధికారులు

నేరడిగొండ(బోథ్): నాటుసారా విక్రయిస్తే శాఖపరమైన చర్యలు తప్పవని అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనివాస్ హెచ్చరించారు. నేరడిగొండ మండలంలోని వాగ్దారితాండ, కుంటాల తాండ, వెంకటాపూర్ తాండ గ్రామాల్లో గురువారం దాడులు నిర్వహించారు. 15 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకుని, 13 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేసినట్లు ఆయన పేర్కొన్నారు. వాగ్దారికి చెందిన రాజు, చౌహాన్ బిక్కు, వెంకటాపూర్ తాండకు చెందిన జమునాబాయి, ఆడె సేవలాల్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. టాస్క్‌ఫోర్స్ సీఐ జి.లక్ష్మణ్‌రావు, ఇచ్చోడ ఎస్సై పి.రాజేశ్వర్, సిబ్బంది పాల్గొన్నారు.

అదుపుతప్పి కంటైనర్ బోల్తా



సర్వీసు రోడ్డుపై బోల్తాపడిన కంటైనర్

గుడిహత్నూర్(బోథ్): మండల కేంద్రంలోని సర్వీసు రోడ్డుపై అదుపుతప్పి ఓ కంటైనర్ బోల్తా పడడంతో పెను ప్రమాదం తప్పింది. స్థానికులు తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. హైదరాబాద్ నుంచి ఆదిలాబాద్ వైపు వేగంగా వెళ్తున్న కంటైనర్ లారీ స్థానిక బస్టాండ్ దాటగానే ముందు వెళ్తున్న మరో లారీని ఢీ కొట్టింది. దీంతో పక్కనే కింది వైపు ఉన్న సర్వీస్ రోడ్డుపై బోల్తా పడింది. ఎప్పుడు రద్దీగా ఉండే ఈ రోడ్డు వద్ద ప్రమాద సమయంలో ఎవరూ లేకపోవడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. ఈ ప్రమాదంలో లారీ డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి.

ఆర్థిక ఇబ్బందులతో ఒకరు ఆత్మహత్య

ఇంద్రవెల్లి(ఖానాపూర్): ఆర్థిక ఇబ్బందులు, అనారోగ్యంతో ఒకరు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకున్నట్లు ఎస్సై సునీల్ తెలిపారు. మండలంలోని హర్కపూర్‌తాండకు చెందిన జాదవ్ నాందేవ్ (47)వ్యవసాయ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. కొంతకాలంగా షుగర్, బీపీతో బాధపడుతూ ఇంట్లోనే ఉంటున్నాడు. కుటుంబ పోషణ భారం కావడమే కాకుండా కూతురికి వివాహం చేసేదెలా? అని మనస్థాపానికి గురయ్యాడు. గురువారం తెల్లవారు జామున ఇంట్లోనే దూలానికి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం అందించడంతో ఎస్సై సునీల్ గ్రామానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు. మృతునికి భార్య అరుణ, కుమారుడు కిరణ్‌కుమార్, కూతురు అర్చన ఉన్నారు.

ఉరేసుకుని వ్యక్తి..

లోకేశ్వరం(ముధోల్): ఉరేసుకుని ఒకరు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై సాయికుమార్ తెలిపిన వివరాల ప్రకారం వట్టోలి గ్రామానికి చెందిన మేత్రి భూమన్న (45) రెండేళ్లుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. పలు ఆస్పత్రుల్లో చికిత్స చేయించినా వ్యాధి నయంకాలేదు. దీంతో మనస్థాపానికి గురయ్యాడు. గురువారం ఉదయం చిన్న వట్టోలి ప్రాంతంలో వేప చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతునికి భార్య సాగరబాయి, కుమారుడు ఉన్నారు. సాగరబాయి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

అనారోగ్యం భరించలేక మరొకరు..

కుభీర్: మండలంలోని నిగ్వా గ్రామానికి చెందిన వి.లింగన్న(48) నడుం నొప్పి భరించలేక పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై ఎండీ.షరీఫ్ తెలిపిన వివరాల ప్రకారం.. లింగన్న పదేళ్లుగా నడుం నొప్పితో బాధపడుతున్నాడు. ఆస్పత్రిలో వైద్యం చేయించుకున్నా నయం కాలేదు. నొప్పి భరించలేక బుధవారం మధ్యాహ్నం చేనులో పురుగుల మందు తాగి వచ్చి పడుకున్నాడు. వాంతులు కావడంతో కుటుంబీకులు భైంసాలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో గురువారం ఉదయం చనిపోయాడు. అతడికి భార్య శ్యామల, ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎండీ షరీఫ్ తెలిపారు.

వితంతు మహిళపై లైంగిక దాడి

నర్సాపూర్(జి): మండల కేంద్రానికి చెందిన వితంతు మహిళపై నర్సాపూర్(జి) గ్రామానికి చెందిన పందిరి లింగం అనే యువకుడు బుధవారం రాత్రి 11 గంటల ప్రాంతంలో లైంగికదాడికి పాల్పడ్డాడని నిర్మల్ రూరల్ సీఐ బి.శ్రీనివాస్, ఎస్సై పాకాల గీత తెలిపారు. బాధిత మహిళ ఫిర్యాదు మేరకు గురువారం కేసు నమోదు చేసినట్లు తెలిపారు. నిందితుడిని అరెస్ట్ చేసి కోర్టుకు తరలించిచామని పేర్కొన్నారు.

స్థలాల క్రమబద్ధీకరణకు డీడీలు కట్టాలి

- కలెక్టర్ బాదావత్ సంతోష్



మాట్లాడుతున్న కలెక్టర్ సంతోష్

రామకృష్ణాపూర్(చెన్నూర్): సింగరేణి స్థలాల్లో ఇండ్లు నిర్మించుకుని పట్టాలు పొందగోరే ప్రతిఒక్కరూ వెంటనే డీడీలు చెల్లించి పట్టాలు పొందాలని కలెక్టర్ బాదావత్ సంతోష్ సూచించారు. గురువారం క్యాతనపల్లి మున్సిపల్ కార్యాలయంలో కౌన్సిల్ సభ్యులతో సమీక్ష నిర్వహించారు. జీవో 76కు సంబంధించి సింగరేణి స్థలాల్లో ఇండ్లు నిర్మించుకున్న వారు ఇంకా 450 మంది వరకు డీడీలు కట్టాల్సి ఉందన్నారు. వీరంతా మరో వారం రోజుల్లోగా డీడీలు చెల్లించేలా వార్డు కౌన్సిలర్లు, ఆర్పీలు చొరవ తీసుకోవాలన్నారు. అవసరమైతే ఇంటింటికీ వెళ్లి డీడీలు కట్టేలా చూడాలన్నారు. 2014 కన్నా ముందు సింగరేణి స్థలాల్లో ఇండ్లు కట్టుకున్న వారికే పట్టాల కోసం అవకాశముండగా ప్రభుత్వం దానిని సవరిస్తూ 2020 వరకు పొడిగించిందన్నారు. అడిషనల్ కలెక్టర్ మధుసూదన్‌నాయక్, మంచిర్యాల ఆర్డీవో వేణు, మందమర్రి తహసీల్దార్ సంపతి శ్రీనివాస్, మున్సిపల్ చైర్‌పర్సన్ జంగం కళ, వైస్ చైర్మన్ సాగర్‌రెడ్డి, కమిషనర్ వెంకటనారాయణ పాల్గొన్నారు.

హత్యాయత్నం కేసులో ముగ్గురికి జైలు

మంచిర్యాలక్రైం: శ్రీరాంపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని బస్టాండ్ వద్ద 2015 ఫిబ్రవరి 22న ఓ వ్యక్తిపై హత్యాయత్నం చేసిన ముగ్గురికి నాలుగేళ్ల జైలు, రూ.1500 చొప్పున జరిమానా విధిస్తూ ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి జీ.ఉదయ్‌కుమార్ గురువారం తీర్పునిచ్చారు. జైపూర్ మండలం నర్సింగాపూర్ గ్రామానికి చెందిన పండుగు రాజన్న, వేముల రవీందర్‌గౌడ్, తోకల సాగర్ అల్లర్లకు పాల్పడుతుండడంతో అదే గ్రామానికి చెందిన బోయిని రాజేందర్, మరి కొందరు కలిసి నిలదీశారు. దీంతో రాజేందర్‌పై కక్షగట్టి హత్య చేయాలని నిర్ణయించుకున్నారు. 2015 ఫిబ్రవరి 22న రాజేందర్, శ్రీకాంత్ ద్విచక్రవాహనంపై మంచిర్యాలకు వెళ్లి వస్తుండగా శ్రీరాపూర్ బస్టాండ్ వద్ద వారిని అడ్డుకుని రాడ్లు, కర్రలతో దాడి చేయడంతో రాజేందర్‌కు తీవ్రగాయాలయ్యాయి. ఈ విషయమై శ్రీరాంపూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా అప్పటి ఎస్సై టీ.సంజీవ్ (ప్రస్తుతం మంచిర్యాల రూరల్ సీఐ) కేసు నమోదు చేసి నిందితులను రిమాండ్‌కు తరలించారు. కోర్టు లైసన్ ఆఫీసర్ కే.శ్రీనివాస్, హెడ్ కానిస్టేబుల్ గులామ్ ధస్తాగిర్ సాక్షులను ప్రవేశపెట్టగా పబ్లిక్ ప్రాసిక్యూటర్ మదన్‌మోహన్‌రావ్ నేరం రుజువు చేయడంతో నిందితులకు నాలుగేళ్ల జైలు, జరిమానా విధిస్తూ న్యాయమూర్తి ఉదయ్‌కుమార్ తీర్పునిచ్చారు.

ఆటో డ్రైవర్‌పై కేసు నమోదు



ఆటోలోంచి కిందకు దిగిన ప్రయాణికులు

కుంటాల(ముధోల్): పరిమితికి మించి ఆటోలో ప్రయాణికులను చేరవేస్తున్న ఆటో డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై హన్మాండ్లు తెలిపారు. మండలంలోని కల్లూర్‌లో జాతీయ రహదారిపై గురువారం పోలీసులు వాహనాలను తనిఖీ చేస్తుండగా కల్లూర్ నుంచి కుంటాలకు వెళ్తున్న ఆటోలో పరిమితికి మించి ప్రయాణికులను చేరవేస్తుండగా వాహనాన్ని ఆపి డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. ప్రతిఒక్కరూ రోడ్డు నియమ నిబంధనలు పాటించాలని, లేనిపక్షంలో చట్టరీత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు.